# అధ్యాయం - 1

# బి.సి. కులాల ఆవిర్భావ పరిణామం

# 1. బి.సి. కులాల ఆవిర్భావ పరిణామం

## 1.0. పరిచయం

భారతీయ సమాజంలో కులం వేలయేళ్ళ నుంచి పాతుకుపోయింది. భారతదేశం గ్రామీణదేశం. కులవృత్తులతోనే భారతీయ గ్రామాలు సజీవంగా నిలిచాయి. ఈ కులవృత్తులను చేపట్టే వృత్తిదారులను వలసపాలకులు, వారి తర్వాత ఏర్పడిన స్వతంత్ర పాలకులు వెనుక బడిన కులాలుగా గుర్తించారు. భారత దేశంలో సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా వృత్తిదారుల పాత్ర కీలకమైంది. ఉత్పత్తి కులాలు, సేవాకులాలు లేకుండా ఆ గ్రామీణ సమాజం ఉండే అవకాశం లేదు. అయినప్పటికి వీరు అగ్రవర్ణాల వద్ద అణగి మణగి ఉండాల్సిందే. శతాబ్దాలుగా సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్న వీరు అనేక వృత్తులుగా ఏ విధంగా ఏర్పడ్డాయి? వృత్తులు కులాలుగా మార్పుచెందే నేపథ్యంలో ఏ విధమైన పరిణామాలు జరిగాయి? కులం రూపాంతరం చెందిన తీరు, తద్వారా బి.సి. కులాల ఆవిర్భావం గురించి ఈ అధ్యాయంలో చూడవచ్చు.

భారతదేశం ప్రధానంగా గ్రామీణ సమాజం అని చెప్పుకున్నాం. వ్యవసాయం, పశువులపెంపకం, చేతివృత్తులు ప్రధానంగా గల సమాజం. అయితే పౌరాణిక భారతీయ సమాజం, చారిత్రక భారతీయసమాజం అని అధ్యయనం చేసినప్పుడు వృత్తులకు సంబంధించిన విషయాలు తెలుస్తాయి. పురాణాల ప్రకారం వర్ణవ్యవస్థ దేశంలోని మొదటి సామాజిక రూపంగా చెప్పవచ్చు.

## 1.1. వర్ణవ్యవస్థ – తొలివిభజన

ప్రాచీన భారతీయ సమాజం వర్ణవ్యవస్థగా ఉండేది. నిజానికి వర్ణం అనే మాట రంగు అనే అర్థాన్ని ఇస్తుంది. ఈ ప్రాతిపదికన ఏర్పడిన వర్ణం క్రమంగా వర్ణవ్యవస్థగా రూపొందింది. ఋగ్వేదంలో వర్ణవ్యవస్థను చూస్తే.

**బ్రాహ్మణోస్య ముఖ మాసీత్ । బహూరాజన్యకృతః।**
**ఊరూ తదస్య యద్వైశ్యః। పదాగ్భ్యం శూద్రో అజాయత।**

**(ఋగ్వేదం పదవ మండలం పురుషసూక్తం)**

విరాట్ పురుషుని ముఖం నుండి బ్రాహ్మణులు, భుజాల నుండి రాజన్యులు (క్షత్రియులు) ఊరువుల నుండి విశ్ (వైశ్యులు) పాదాల నుండి శూద్రులు వచ్చారని ఋగ్వేదం చెబుతుంది. దీనిలో సమాజాన్నంతటిని ఒక పురుషునిగా రూపించి, సామాజిక కర్మలను అవయవాలుగా వల్లించడం జరిగింది.

అలాగే రామాయణంలో చూస్తే కశ్యపి ప్రజాపతి భార్య 'మనువ'నే వనిత బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులయిన మానవులను ప్రసవించెను అని చెప్పబడింది.

అలాగే మహాభారతంలో కులాల వారిగా రంగులను శాంతిపర్వంలో తిక్కన చెప్పాడు.

**బ్రాహ్మణానాం సితోవర్ణః క్షత్రియాణాం చలోహితః**
**వైశ్యానాం పీతకోవర్ణః శూద్రాణాం అసితస్త ధాః ॥**

**(మ॥భా। అధ్యాయం 186 శ్లో-05)**

బ్రాహ్మణులు తెలుపు, క్షత్రియులు ఎరుపు, వైశ్యులు పసుపురంగు, శూద్రులు నలుపు శరీరాలు కలవారని చెప్పాడు.

అలాగే భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన నాలుగు వర్ణాలను చూస్తే

చాతుర్వర్ణం మయాసృష్టమ్ గుణకర్మ విభాగాశః
తస్య కర్తార మపి మాం విద్ధ్యకర్తారమవ్యయమ్

(భగవద్గీత - భక్తివేదాంత బుక్‌ట్రస్ట్ - పుట.255)

గీత ప్రకారం చతుర్వర్ణాలను కృష్ణుడు సృష్టించాడు. అయితే వేదాలలో చెప్పినట్టుకాక గుణకర్మను బట్టి నాలుగు వర్ణాలను సృష్టించానని కృష్ణుడు చెబుతాడు. అంటే మనుషుల స్వభావమూ, వారు చేసే పనిని బట్టి వారిని నాలుగు వర్ణాలుగా విభజించానని కృష్ణుడు అంటాడు. ఇక్కడ భగవద్గీత కర్మను ఆధారం చేసింది. కర్మ అంటే పని. చేసేపనిని బట్టి వర్ణం అని నిర్ణయించింది.

మొత్తంగా సారాంశం చూస్తే అప్పటికి వర్ణవ్యవస్థ ఉందని ఆ గ్రంథాలు చెబుతున్నాయి. అలాగే చారిత్రక భారతీయ సమాజాన్ని చూస్తే వర్ణవ్యవస్థ వృత్తులద్వారా ఏర్పడిందని తెలుస్తుంది. అది లోహాల అన్వేషణతో ప్రారంభమైంది.

## 1.2. లోహాల అన్వేషణ - వృత్తులు ఏర్పడటం - వృత్తుల విభజన

ప్రతి నాగరిక సమాజ పూర్వదశలో మానవజాతి సంచారదశలో ఉండేది. గుంపులు గుంపులుగా ఏర్పడిన ప్రజలు తెగలుగా ఏర్పడటం. అందరూ కలిసి ఆహారం సంపాదించుకోవడం. ఏరుకొని తెచ్చిన ఆహారాన్ని అందరూ కలిసి పంచుకోవడం, అందరూ కలిసి ఆడ, మగా తేడా లేకుండా జంతువులను వేటాడటం, వేటాడి తెచ్చుకున్న జంతువును కాల్చితినడం వరకు జరిగింది. ఆ తర్వాత కాలక్రమంలో ఇనుమును కనిపెట్టడం, వివిధ రకాల పనిముట్ల తయారీలో రాగి, రాయి, ఎముకల స్థానాన్ని ఇనుము ఆక్రమించడంతో సరికొత్త పనిముట్లు తీసుకువచ్చి వాటి సంఖ్యను కూడ పెంచింది. పంటలు పండించడంలో వ్యవసాయానికి కావల్సిన పనిముట్లు ఏర్పరుచుకోవడానికి కొన్ని కొత్త వృత్తులు ఏర్పడటం జరిగింది. ఆ క్రమంలో

కొందరు వ్యవసాయం చేస్తే మరికొందరు దాని సంబంధిత వృత్తులు చేపట్టడం జరిగింది. ఈ పరిణామంలో అనేక వృత్తులు రావటం వృత్తులను జనం వేరువేరుగా తమ తమ అభిరుచులను బట్టి చేపట్టడం ఇదంతా మానవ చరిత్ర పరిణామక్రమంలో జరిగింది. సామాజిక అవసరాలకు వృత్తులు పెరుగుతూ ఉంటే వాటిని చేపట్టే ప్రజలు పెరుగుతూ వచ్చారు. ప్రధానంగా "సమాజంలోని ప్రజలు వృత్తులను బట్టి వేరుపడటం జరిగింది. జాతులు, తెగలు ప్రజలను వేరుచేసినా ఆయాజాతులు, తెగలమధ్య వృత్తి తిరిగి విభజన చేసింది. ప్రధానమైన విభజన వృత్తి పరమైంది. ఈ వృత్తి నుంచి వర్ణం ఏర్పడింది. వర్ణం అనేది వృత్తి హోదామీద ఆధారపడింది. ఒక వ్యక్తి చేపట్టిన వృత్తి హోదా నుంచి అతని వర్ణనిర్ణయం జరిగింది."[1] అని బొజ్జాతారకం అన్నారు.

## 1.3. వృత్తులు ఏర్పరిచిన కులవ్యవస్థ

కులం ఎలా ఏర్పడిందనే విషయంలో అనేక సిద్ధాంతాలు వచ్చాయి. అయితే వృత్తిమీద ఆధారపడి వచ్చినవే అనేది ఎక్కువ అంగీకారం పొందిన సిద్ధాంతం. సమాజం పరిణామక్రమం చూసినా మనకు కనబడేది ఈ అంశమే. ప్రత్యేకంగా వృత్తితో కులం ఏర్పడటం మూలంగా వృత్తికి వుండే విలువ కులానికి వచ్చింది. కులం అనేది అంతర్వివాహంతో ఏర్పడటం మూలంగా ఆ కులంలో పుట్టిన వ్యక్తి దానికి సంబంధించిన వృత్తిని చేపట్టినా చేపట్టకపోయినా అదే విలువ అతనికి దొరకటం జరిగింది. "వృత్తులు వారసత్వానికి బిగిస్తే వృత్తి వర్ణం అయింది. వర్ణానికి అంతర్వివాహ పద్ధతిని నిర్ణయిస్తే కులం ఏర్పడింది."[2] నాలుగు వర్ణాలు నాలుగు వర్గాలయినాయి. నాలుగు వర్గాలు అనేక కులాలుగా మారాయి. అందుకే అంబేద్కర్ "దడికట్టుకున్న వర్గమే కులం" అంటాడు. కులవ్యవస్థ గల గ్రామీణ స్వయం పోషక

1. కులం - వర్గం - బొజ్జాతారకం, పుట.17
2. పైదే. పుట.16

జీవితంలో ప్రతికులానికి కొన్ని ప్రత్యేక వృత్తులు, సేవలు ఏర్పడి నైపుణ్యం పెరుగుతూ వచ్చింది. గ్రామీణ స్వయం పోషక ఆర్థిక రాజకీయవ్యవస్థగా కులవ్యవస్థ కులవృత్తులపై ఆధారపడి ఉంది.

## 1.4. వృత్తులు - వృత్తి మర్యాదలు

భారతసమాజం కొన్ని వేల కులాలుగా చీలిపోయింది. శ్రామికులు కూడ అన్ని వేల కులాలుగా చీలిపోయి ఉన్నారు. సమాజంలో స్థిర జీవనం, వ్యవసాయ వృత్తులు ఏర్పడిన తర్వాత ఒకోవృత్తిని ఒక్కో కుటుంబం చేపట్టిన తర్వాత వృత్తుల పరంగా పిలుచుకోవటం జరిగింది. ఉదాహరణకు బట్టలు నేసేవారిని సాలెవారు అన్నారు. కుండలు చేసేవారని కుమ్మరి, బుట్టలు, తట్టలు అల్లినవారిని మేదరి, కొడవళ్ళు, నాగళ్ళు చేసేవారిని కమ్మరి అన్నారు. ఇలా ఒక్కొక్క వృత్తికి ఒక్కొక్క కులం పేరు స్థిరీకరించారు. అంతటితో ఆగలేదు. ఒక వృత్తికి మర్యాద మరొకవృత్తికి నీచత్వం ఆపాదించారు. కొన్ని వృత్తులు మంచివి ఉత్తమమైనవి అయ్యాయి. కొన్ని చెడ్డవి నీచమైనవి అయ్యాయి. మంచి వృత్తులు చేసేవారికి మర్యాదలభిస్తే, చెడ్డవృత్తులు చేపట్టినవారికి అగౌరవం లభించింది. అయితే ఏ ఒక్కరూ కూడ ఇష్టంతో ఈ చెడ్డ వృత్తులు చేపట్టి అగౌరవం, అమర్యాదకావాలని తెచ్చి పెట్టుకోవడం లేదు. అది వారి నెత్తిన రుద్దారు.

## 1.5. బి.సి.(వెనుకబడిన)కులాల పదం - పుట్టుక

"వెనుకబాటుతనం అనేపదం మొదటిసారిగా 1875లో మద్రాస్ ప్రెసిడెన్సీలో ఉపయోగించబడింది. 1895 నవంబర్ 5న సెయింట్ జార్జి పేరుతో విడుదల చేసిన గెజిట్‌లో వెనుకబడిన వర్గాలకు స్కూల్స్‌లో గ్రాంట్ ఇన్-ఎయిడ్స్' మంజూరు చేయాలని పేర్కొన్నది. దీనిలో ఎస్సీలను కూడ చేర్చారు. అప్పటికి 39 వెనుకబడిన

వర్గాలను గుర్తించింది. 1950 నాటికి 152 వెనుక బడిన వర్గాలుగా గుర్తించారు. బ్రాహ్మణేతరులందరిని వెనుకబడిన వర్గాలుగా పరిగణించారు.

1910లో మొదటిసారిగా Depressed Classes అనే పదాన్ని మింటో–మార్లే సంస్కరణల్లో ఉపయోగించారు. 1925లో బొంబాయి ప్రెసిడెన్సీ ప్రభుత్వ తీర్మానం చేస్తూ 'వెనుకబడిన' అనే పదాన్ని విస్తృత అర్థంలో వినియోగించి కులాలు లేదా వర్గాలు అని పేర్కొంది. విద్యాపరంగా వెనుకబడిన వారందరిని 'వెనుకబడినవారిగా' పేర్కొంది. ఆ తర్వాత 1929లో సైమన్ కమీషన్ 'ఇంటర్ మీడియట్ క్లాసెస్' అనే పదాన్ని వాడింది. 1930లో ఇండియన్ ఫ్రాంచైజ్ కమిటీ చాలాసార్లు బ్యాక్‌వర్డ్ అనే పదాన్ని వాడింది. 1931 జనాభా లెక్కల్లో వెనుకబడిన తరగతుల నుండి అణగారిన కులాలను మినహాయించి జనాభా లెక్కలను సిద్ధం చేశారు. 1944లో వెనుకబడిన వర్గాలను శూద్ర అగ్రకులాల నుండి వేరుచేసి 'బి.సి.'లుగా పేర్కొన్నారు. 1954లో బ్యాక్‌వర్డ్ క్లాసెస్ జాబితా 1957లో బాగా వెనుకబడిన కులాల ప్రత్యేక జాబితాను రూపొందించారు."[1]

## 1.6. బి.సి. కులాల జాబితా

సమాజంలో ఏర్పడిన నాలుగు వర్ణాలలో చివరిది శూద్రవర్ణం. వర్ణం కులంగా మారినప్పుడు పై మూడు వర్ణాలు కులాలుగానే ఏర్పడ్డాయి. అయితే నాల్గవ వర్ణం అనేక వృత్తుల కలయిక కాబట్టి అవి కులాలుగా మారినప్పుడు అనేక కులాలుగా ఏర్పడ్డాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2005లో 93 కులాలున్న బి.సి. కులాల జాబితా ప్రస్తుతం ఉపకులాలతోసహా 140కి చేరింది. గ్రూపు 'A' లో 53, గ్రూపు 'B' 28, గ్రూపు 'C'లో 1, గ్రూపు 'D'లో 41, గ్రూపు 'E'లో 14 రకాల కులాలు ఉన్నాయి. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన ముస్లింలను 2007లో ప్రభుత్వం

---

1. బి.సి.ల కుర్చీలపై అగ్రకులాల కబ్జా ఎన్నాళ్ళు?(సంపా.) రమణమూర్తి, పుట.225-226

బి.సిల్లో చేర్చింది. అయితే అస్తిత్వ కులాల ఉద్యమాలు వచ్చిన నేపథ్యంలో మైనార్టీ కులాల అస్తిత్వం కూడ ప్రత్యేకంగా వచ్చింది. అందు వలన ముస్లిం మైనార్టీ కులాలను పేర్కొనటం లేదు. కేవలం బి.సి.ల్లోని నాలుగు వర్గాల కులాలను మాత్రమే ఇక్కడ తీసుకున్నాను.

**గ్రూపు A - 53 కులాలు**

1. అగ్నికుల క్షత్రియ, పల్లి, వాడ బలిజ, బెస్త, జాలరి, గంగవారు, గంగపుత్ర, గూండ్ల, వన్యకులక్షత్రియ, వన్నెకాపు, వన్నెరెడ్డి, పల్లికాపు, పల్లిరెడ్డి 2. బాలసంతు, బహురూపి 3. బండార 4. బుడబుక్కల 5. రజక, చాకలి, వన్నార్; 6.దాసరి 7. దొమ్మర 8. గంగిరెద్దుల 9. జంగం 10. జోగి 11. కాటిపాపల 12. కొర్చ 13. లంబాడ, బంజార (తెలంగాణ) 14. మేదరి 15. మొండివారు, మొండిబండ, బండ 16. నాయీబ్రాహ్మణులు నియోగీ నాయిబ్రాహ్మణ, మంగల 17. నక్కల 18. పిచ్చిగుంట్ల, వంశరాజ్ 19. పాముల 20. పార్థి, నిర్షికారి 21. పంబల 22. పెద్దమ్మవాళ్ళు, దేవరవాళ్ళు, ఎల్లమ్మవాళ్ళు, ముత్యాలమ్మ వాళ్ళు 23. వీరముష్టి, నెత్తికోతల, వీరభద్రులు 24. వాల్మీకి, బోయ, బేదారు, కిరాతక, నిషాది, ఎల్లాపి, ఎల్లపు పెద్దబోయె, తలయూరి, చుండు, 25. ఎరుకల (తెలంగాణ) 26. గూడల 27. కంజరభట్ట 28. కెప్మారె, రెడ్డిక 29. మొండిపట్ట 30. నొక్కారు 31. పెరికిముగ్గుల 32. యాత 33. చోపెమారి 34. కైకాడి 35. జోషినందివాలా 36. ఒడ్డెర, ఒడ్డీలు, వడ్డి, వడ్డెలు 37. మందుల 38. మెహతారు (ముస్లిం) 39. కూనపులి 40. పట్ర 41. కూరాకుల, పొందర 42. సామంతుల, సామంత, సాంతియా, సౌంతియా 43. పాలఏకిరి, ఏకిరి, ఎకిల, వ్యాకుల 44. నాయనిగారు, పాలెగారు, తోలగారి, కావలి 45. రాజనాల, రాజన్నలు 46. బుక్కఅయ్యవారు 47. గోత్రాల 48. కాశికాపడి 49. సిద్దుల 50. శిక్లిగార్ 51. పూసల 52. ఆసాదులు, ఆసాది 53. కెయిత

**గ్రూపు B - 28 కులాలు**

1. అచ్చుకట్లవాళ్ళు 2. ఆర్యక్షత్రియ, చిత్తరి, గినియార్, చిత్రకార, నక్షా, నకాషీ 3. దేవాంగ 4. గౌడ, ఈడిగ, గమళ్ళ, కలలీ, గౌండ్ల శెట్టిబలిజ, గాజుల బలిజ, 5. దూదేకుల 6. లద్దాఫ్ 7. పింజారి, నూర్‌భాష్ 6. గాండ్ల, తెలికుల, దేవతిలకుల 7. జాండ్ర 8. కుమ్మరి, కులాల, శాలివాహన 9. కరికాల భక్తుల, కైకోలన్, కైకోలన్, సెంగుదం, సెంగుంతర్ 10. కర్ణభక్తుల 11. కురుబ, కురుమ 12. నాగవడ్డీలు 13. నీలకంఠి 14. పట్కర్, కత్రి 15. పెరిక, పెరికబలిజ, పురగిరిక్షత్రియ, 16. నెస్సి, కుర్ని 17. పద్మశాలి, శాలి, శాలివన్, పట్టుశాలి, సేనాపతులు, తొగటశాలి 18. శ్రీశయన, సెగిడి 19. స్వకులసాలి 20. తొగట, తొగట వీరక్షత్రియులు, తొగటి 21. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ, అవుసల, కంసలి, కమ్మరి, కంచరి, వడ్ల, వడ్ర, వడ్రంగి, శిల్పి 22. లోధ్, లోధీ, లోదా 23. నగరాలు 24. బొందిలి 25. ఆరెమరాఠి, మరాఠ (బ్రాహ్మణేతర) సురభి నాటకాల వాళ్ళు 26. నీలి 27. బుడుబుంజల, భుజ్వా భడ్బుంజా, 28. గుద్యా, గుడియా

**గ్రూపు C - కులం 1**

ఈ విభాగంలోని వారు క్రైస్తవ మతంలోకి మారిన షెడ్యూల్డ్ కులస్తులు

**గ్రూపు D - కులాలు 41**

1. అగరు 2. ఆరెకటిక, కటిక 3. అటగర 4. భట్రాజు 5. చిప్పోళ్ళు, మేర 6. గవర 7. గొడబ 8. హట్కారు 9. జక్కల 10. జింగారు 11. కాండ్ర 12. కోష్టి 13. కాచి 14. సూర్యబలిజ, కళావంతులు, గణిక, సూర్యవంశి 15. కృష్ణబలిజ, దాసరి, బుక్కా 16. కొప్పువెలమ 17. మధుర 18. మాలి, బారె, బరాయి, మరార్, తంబోలి (తెలంగాణ) 19. మున్నూరుకాపు (తెలంగాణ) 20.

నాగవంశం 21. నెల్లి 22. పొలనాటి వెలమ 23. పాసి, పస్సి, పాసీ 24. రంగ్రేజు, భవసారక్షత్రియ 25. సాధుచెట్టి 26. సాతాని, చెత్తదాసరి, చాత్తాదశ్రీ వైష్ణవ 27. తమ్మలి 28. తూర్పుకాపు, గాజులకాపు 29. ఉప్పర, సగర 30. వంజర, వంజరి, 31. యాదవ, గొల్ల 32. బెరివెశ్య, బెరిచెట్టి 33. అరవ, అయ్యరక, అఘముదియన్, అఘముదియార్, అగముడివెల్లలార్, అగముది ముదలియార్, తులువెల్లలాస్ 34. ఆరె, ఆరెవాళ్ళు, ఆరోళ్ళు 35. అతిరాస 36. సోంది, సుంది, 37. వరాల 38. శిష్టకరణం 39. లక్కమారికాపు 40. వీరశైవలింగాయత్ 41. కుర్మి

పై బి.సి. కులాల జాబితాను చూస్తే నాలుగు వర్గాలలోని వారు మొత్తంగా చూస్తే (మైనార్టీకులం మినహా) 137 కులాలుగా ఉన్నాయి. శూద్ర కులాల జీవితం కులవృత్తులతో, కులవ్యవస్థతో ముడిపడి ఉంది.

గిరిజనులకన్నా కాస్త మెరుగ్గా ఉంటూ మైదాన ప్రాంత ప్రజలతో కలిసి జీవిస్తున్న సంచార తెగలను బి.సి.–ఎ గ్రూపులో చేర్చారు.

చేతి వృత్తులకు సంబంధించిన వారుగా, వంశ పారంపర్యంగా ఆ వృత్తులను కొనసాగించే వారిని బి.సి. – 'బి' గ్రూపులో చేర్చారు.

షెడ్యూల్డ్ కులముల నుండి క్రైస్తవమతం స్వీకరించినవారు, వారి సంతతి బి.సి.–సి గ్రూపులో చేర్చారు.

శూద్రుల్లో అగ్రకులాలుగా ఉంటూ అనేక సేవావృత్తులుగా ఉన్న వారిని, ఇతర వర్గాల వారిని బి.సి.–'డి' గ్రూపులో చేర్చారు.

పై నాలుగు వర్గాలు లేదా తరగతులుగా ఉన్న అనేక కులాలను చూస్తే సంచారకులాలుగా, చేతివృత్తి కులాలుగా, సేవా కులాలుగా ఉన్నారు. వీరి మధ్య

సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరమైన అంశాలేవి వీరి మధ్య పోలికగా కనిపించవు. శూద్రులనే ఒక మాట వాడటం వలన వీరందరూ బహుజనులుగా లేదా బి.సి.లుగా పిలవబడుతున్నారు. రాజకీయ పరమైన అంశాలు రిజర్వేషన్లు, రాజ్యాంగంలో చెప్పబడిన వెనుకబడిన తరగతులు అనే అంశాల ఆధారంగా బి.సి. లందరూ విభజన పరంగా ఒక్కటి కావడానికి అవకాశం ఏర్పడింది.

## 1.7. బి.సి. కులాలపై కమీషన్లు

భారతరాజ్యాంగం రూపొందించే నాటికి సమాజంలో కొన్ని తరగతులు సామాజికంగా విద్యావిషయకంగా చాలా వెనుకబడి ఉన్న వాస్తవాన్ని గురించి, వారి ఇబ్బందుల్ని తొలగించి వారి పరిస్థితి సామాజికంగా విద్యారంగంలో అభివృద్ధి చేయుటకు గాను, దేశ అధ్యక్షులు ఒక కమీషన్ నియమించవచ్చునని రాజ్యాంగంలో 340 ఆర్టికల్ పొందుపరచబడింది.

1949 సంవత్సరంలో ఆమోదింపబడిన రాజ్యాంగంలో ఆర్టికల్ 340 అనుసరించి 1953న మొదటి వెనుకబడిన తరగతుల కమీషన్ ఏర్పడింది. కాకా కాలేల్కర్ అధ్యక్షతన ఈ కమీషన్ నియమించబడింది.

సాంఘికంగా విద్యా విషయకంగా ఎవరు వెనుకబడిన తరగతులవారు అవుతారో నిర్ణయం చేసింది. హిందూ సమాజంలో సంప్రదాయకంగా వస్తూ ఉన్న కులవ్యవస్థలో సామాజికంగా ఉన్న తక్కువస్థాయి కులంలో ఎక్కువ మందికి విద్య విషయంలో పురోభివృద్ధి లేకపోవడం.

1. వెనుకబడిన తనానికి కులం ప్రాతిపదిక కాదని ఈ కమీషన్ సూచించింది.

2. ప్రభుత్వ ఉద్యోగాలలో తగినంత ప్రాతినిధ్యం లేకపోవడం లేదా అసలు ప్రాతినిధ్యమే లేకుండా పోవటం

3. వ్యాపార వాణిజ్య పారిశ్రామిక రంగాలలో తగిన ప్రాతినిధ్యం లేకపోవడం

మొత్తం దేశంలో 2300 వెనుకబడిన కులాలు, తరగతులు ఉన్నాయని, అందులో 837 మరీ వెనుకబడిన కులాలు ఉన్నాయని కమీషన్ ఒక జాబితా తయారు చేసింది.

వెనుకబడిన కులాల అభివృద్ధికి విస్తృతమైన సూచనలు చేసింది. విస్తృతంగా భూ సంస్కరణ అమలు చేయడం భూదాన ఉద్యమం, పశుగణాభివృద్ధి, పాడి పరిశ్రమ పశువుల భీమా పథకం, తేనెటీగల పెంపకం, గ్రామీణ కుటీర పరిశ్రమల అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, వయోజన విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో వెనుకబడిన తరగతులవారికి ప్రాతినిధ్యం మొదలైన అంశాలు ఈ కమీషన్‌లో సూచించబడ్డాయి.

ఈ కమీషన్ సూచించిన విషయాల్ని కేంద్ర ప్రభుత్వం ఆమోదించలేదు కాని రాష్ట్ర ప్రభుత్వాలు తాము నిర్ణయించుకున్న ఆధారాలను బట్టి తమ తమ రాష్ట్రాలలో వెనుకబడిన తరగతుల జాబితాను తయారు చేసుకొని అవసరమైన చర్యలు తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు స్వేచ్ఛ ఉందని చెప్పింది.

వెనుకబడిన తనాన్ని నిర్ణయించడానికి అనేక రాష్ట్రాలు కమీషన్లు నియమించాయి. బీహార్, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, జమ్మూకాశ్మీర్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, పంజాబ్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు మరియు కేంద్ర పాలిత ప్రాంతాలు విద్యా ఉద్యోగ రంగంలో వివిధ రకాల ప్రయోజనాలు కల్పించటం కోసం వెనుకబడిన తరగతుల జాబితాలు తయారు చేసుకున్నాయి. ఈ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడ అనంతరామన్ కమీషన్ 1968లో ఏర్పాటయింది. ఇది బి.సి. కులాన్ని ప్రాతిపదికగా తీసుకొని 30% రిజర్వేషన్లు కల్పించాలని సిఫార్సు చేయగా 1975 నుండి 25% రిజర్వేషన్ కల్పించింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో

బి.సి.ల రిజర్వేషన్లు ఒక స్పష్టమైన విధానంలో అమలు జరగలేదు. అందువలన 1978లో నాటి ప్రధాని మొరార్జీదేశాయ్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి కొరకు బిందేశ్వర ప్రసాద్ మండల్ అధ్యక్షతన ఒక కమీషన్ నియమించింది. ఈ కమీషన్ బి.సి. లకు కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో 27% రిజర్వేషన్లు ప్రకటించింది. ఈ ప్రకటన ఇవ్వగానే అగ్రకులాలు ధర్నాలు, బంద్‌లు లాంటి ఆందోళన కార్యక్రమాలు చేశారు. చివరికి సుప్రీం కోర్టుకి చేరగా క్రిమిలేయర్ నిబంధనలతో బి.సి. లకు ఉద్యోగాలలో 27% రిజర్వేషన్లు ఇవ్వాలని చెప్పింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు రిజర్వేషన్లు 50% మించరాదని చెప్పింది. మండల్ కమీషన్‌లో 'వెనుకబడిన తరగతులకు' సంబంధించి అనేక సిపార్సులు చేసినప్పటికి అవి అమలుకు నోచుకోలేదు.

వెనుకబడిన తరగతుల గురించి అధ్యయనం చేసేందుకు మరియు 1970 అనంతరామన్ కమీషన్ వెనుకబడిన తరగతులకు పది సంవత్సరాల పాటు రిజర్వేషన్లు వర్తింప చేయాలని ఆ తర్వాత ఫలితాలని సమీక్షించి తగిన నిర్ణయం చేయాలి. అని చెప్పింది. ఈ ఉద్దేశం నెరవేర్చుటకై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1982లో మురళీధరరావు ఆధ్వర్యంలో ఏక సభ్య కమీషన్ ఏర్పాటైంది.

ఆంధ్రరాష్ట్ర అవతరణకి ముందు ఉమ్మడి మద్రాస్‌లోను మరియు హైదారాబాద్ సంస్థానంలో వెనుకబడిన తరగతుల జాబితా అప్పటికే ఉంది. 1956 నాటికి వెనుకబడిన తరగతుల జాబితాను చూస్తే ఆంధ్రాలో 86 తెలంగాణలో 60 కులాలున్నాయి.

మండల కమీషన్ నివేదిక నుండి ఆంధ్ర ప్రదేశ్ వెనుకబడిన కులాలలో 292 కులాలు ఉన్నాయి. అలాగే మండల్ కమీషన్‌లో పేర్కొన్న బి.సి. జనాభా గురించి కూడా అంచనాలు చెప్పబడ్డాయి.

వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని మురళీధరరావు కమీషన్ బి.సి.ల జనాభాని 52% శాతంగా గుర్తించింది.

బి.సి. జాబితాలో నాలుగు గ్రూపులు ఉండగా ఈ కమీషన్ ఐదు గ్రూపులుగా ఉండాలని సిఫారసు చేసింది. బి.సి. లకు కల్పిస్తున్న 25% రిజర్వేషన్లను 44% పెంచాలని సూచించింది.

అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 44% ఉద్యోగాలు బి.సి.లకు రిజర్వేషన్ కల్పిస్తూ ఆమోదించింది. కాని అగ్రకులాలు ఈ విషయంపై పార్టీలతో సంబంధం లేకుండా అందరూ ఏకమై ప్రభుత్వాన్ని స్తంభింపజేశారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేశారు. చివరకు సుప్రీం కోర్టు బి.సి.లకు 27% రిజర్వేషన్స్ దేశం మొత్తం మీద అమలు చేసింది. ఈ కమీషన్ల యొక్క పూర్వాపరాలను పరిశీలిస్తే జనాభా ప్రాతిపదికన విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు అమలు జరగాలని చెప్పినా అమలుకు నోచుకోలేదు. అలాగే రాజకీయ రంగంలో బి.సి.లకు సముచిత స్థానం లేదు. అలాగే దీని వలన బి.సి. కులాలు ఆర్థికంగా, సాంఘికంగా, రాజకీయంగా అభివృద్ధి జరగడం లేదు.

## 1.8. వెనుకబడిన కులాలా? వెనుకవేయబడిన కులాలా?

భారతరాజ్యంగంలో 'వెనుకబడిన' అనే పదం వాడబడింది. ఆర్టికల్ 15(4) సామాజిక పరంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ప్రత్యేక సౌకర్యాలు, మినహాయింపులు ఇవ్వవచ్చు అని చెప్పబడింది. అయితే సామాజిక ఆర్థిక, రాజకీయ, విద్యా సంబంధిత విషయాలలో ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు ఉన్నప్పుడు, ఆ అవకాశాలను వినియోగించుకోలేనప్పుడు లేదా అందిపుచ్చుకోలేనప్పుడు 'వెనుకబడిన వారు'గా చెప్పడానికి అవకాశం ఉంటుంది. అయితే అసమానతలుగా

ఉన్న వ్యవస్థలో బలహీనవర్గాల వారికి ఎటువంటి అవకాశాలు (సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ) ఇవ్వని పరిస్థితులు కళ్ళకు కట్టినట్టు కనిపిస్తాయి. సుదీర్ఘ కాలం నుంచి అమలవుతున్న వర్ణవ్యవస్థ ఫలితంగా వివిధ కులాల, జాతుల అభివృద్ధి కుంటుపడుతూ వచ్చింది. జ్ఞానాన్ని తమకే సొంతం చేసుకున్న అగ్రవర్ణాల వారు మేధావులుగా ఎదిగారు. ఆ సమయంలో బలహీనవర్గాలవారు సాంఘికంగా, ఆర్థికంగా, విద్యావిషయకంగా సాంస్కృతిక అణచివేతకు గురయ్యారు. అటువంటి అసమానతలు అవకాశాలు లేని వ్యవస్థలో బలహీనవర్గాలను 'వెనుకబడిన' వారిగా పిలవడం కంటే 'వెనుకవేయబడిన' వారిగా పిలవటం సమంజసంగా ఉంటుంది. ఇలాంటి విషయాన్నే బి.ఎస్. రాములు కూడ చెప్పారు.

"బి.సి.లనడంలో, వెనుకబడిన వర్గాలు అనడంలో వెనుకబడిన అనే పదం మనపై మనమే రుద్దుకునే వెనుకబాటుతనం ఉంది. ఐక్యరాజ్యసమితి చర్చల అనంతరం వెనుకబడిన దేశాలను అభివృద్ధి చెందుతున్న దేశాలని పిలవడం జరుగుతున్నది. అట్లే వెనుకబడిన కులాలను 'అభివృద్ధి చెందుతున్న కులాలు లేదా చెందాల్సిన కులాలు'గా పునర్ నిర్వచించుకోవడం అవసరం. అభివృద్ధి చెందాల్సిన వర్గాలు, అభివృద్ధి చెందాల్సిన కులాలు అనడంలో లక్ష్యం కూడ ఇమిడి ఉంది"[1]

పై విషయాన్ని బట్టి బి.సి.లు, వెనుకబడిన కులాలు అనే పేరు స్థిరీకరించబడిన, వాటిని అభివృద్ధి చెందాల్సిన కులాలు అంటూ పాజిటివ్ దృక్పథంతో పిలవాలని బి.ఎస్. రాములుగారు సూచిస్తున్నట్లుగా మనం భావించాలి. అంతేగాక 'వెనుకబడిన కులాలు' అనటంతో ఎందులో వెనుకబడి పోయాం అని ఆలోచిస్తే ఐక్యతలో మాత్రమే వెనుకబడిపోయాం. కాబట్టి ఆ ఐక్య పోరాటం గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది.

1. బహుజనతత్వం – బి.ఎస్. రాములు పుట.59

## 1.9. బి.సి. అస్తిత్వవాదం

1984 లో ఏప్రిల్ 14న భారతదేశంలో బహుజన సమాజ్ పార్టీ ఏర్పడిన తర్వాత సామాజిక రంగంలో 'బహుజనులు' అనే భావన బాగా వ్యాప్తిలోకి వచ్చింది. మనువాద వ్యవస్థ వల్ల కష్టనష్టాలకు గురైన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు వెనుకబడిన తరగతులు, మైనార్టీలు అందరు కలిసి బహుజనులవుతారని బహుజన సమాజ్ పార్టీ తన ప్రణాళికలో ప్రకటించింది. రాజకీయంగా బహుజనులంటే పై వర్గాలని ఆ పార్టీ పిలిచింది. అయితే నేడు వీరిని అలా పిలవడం లేదు. ఒక్కొక్క అస్తిత్వవాదంగా అవి విచ్ఛిన్నమయ్యాయి.

ప్రారంభదశలో యస్.సి., యస్.టి. బి.సి.లు తమ గురించి తమ కష్టాలగురించి చిక్కనవుతున్నపాట, పదునెక్కినపాట, చిత్తరువు వంటి దళిత సంకలనాలను వెలువరించారు. అంతవరకు దళిత కవులు, బి.సి. కవులు దళితుల పట్ల జరుగుతున్న అణచివేతను రాశారు. అయితే కంచికర్ణకోటేషు కారంచేడు, చుండూరు, పదిరికుప్పం, వేంపెంట మొదలైన చోట్ల దళితులపై జరిగిన ఊచకోతలు దళితుల అస్తిత్వాన్ని ప్రశ్నించాయి. ఈ నేపథ్యంలో దళితుల అస్తిత్వం గురించి, ఆత్మగౌరవం గురించి రాయడం మొదలు పెట్టారు. అలా దళితవాదం ఒక ప్రత్యేక ఉద్యమంలా ఏర్పడింది. ఈ విషయాన్ని ప్రస్తావించడానికి, కారణం ఏమిటంటే తెలుగు దళిత సాహిత్య ఆవిర్భావం కాలంలో ఒక విశాల ప్రాతిపదికగా సంఘటితమైన యస్.సి., యస్.టి., బి.సి., మైనార్టీ కవులు నిర్ధిష్టతలవైపు విడిపోయి చైతన్యాలవైపు, సొంత అస్తిత్వాల వైపు మళ్ళారు. ఎవరు దళితులు? ఎవరు రాసింది దళిత కవిత్వం? అనే విస్తృత చర్చల అనంతరం ఈ నిర్దిష్టతలు ఏర్పడటం గమనించాల్సిన అంశం. యస్.సి., యస్.టి., బి.సి., మైనార్టీలు రాసింది దళితకవిత్వం అనే విశాలార్థం ప్రచారం జరిగింది. 'చిక్కనవుతున్నపాట' సంకలనంలో యస్.సి.ల ఊచకోతల మీద

అనేక మంది బి.సి. కవులు నిజాయితీగా స్పందించి కవిత్వం రాయడం గమనించవచ్చు. అయితే అంతవరకూ ఎస్.సి.ల సమస్యలను తమగొంతుకతో పలికించిన బి.సి.లు, యస్.సి.లకే కాదు తమకూ సమస్యలు ఉన్నాయని, వాటి గురించి తాము కూడా గానం చెయ్యాల్సిన అవసరాన్ని బి.సి.లు గుర్తించారు.

ఈ అంశంపై సతీష్ చందర్ ఆలోచనాత్మకమైన చర్చ లేవనెత్తాడు. "బి.సి.లు ఆకలితో చనిపోతే యస్.సిలు అవమానాలతో చనిపోయారని చెప్తూ, తమ అనుభవాల్ని రాయవల్సిన బి.సి. కవులు, యస్.సి.ల అనుభవాల్ని రాసి, తమ అనుభవాల్ని దాచి పెట్టారని సతీష్‌చందర్ ఆరోపించారు. పేరు చివర బ్రాహ్మణ శబ్దాలను పెట్టుకున్నా, జంధ్యాలను ధరించినా, నీచవృత్తులూ, అవమానాలు బి.సి.లకు తప్పలేదని చెప్తూ ఈ అవమానాల దొంతర నుంచి ఆవిర్భవించిన బి.సి. కవులు, విమర్శకులు తమలోని పులుపును చంపుకోవాలి. గాయాలను ధైర్యంగా బయటపెట్టాలి. యస్.సిలకన్నా తాము ఒక మెట్టు పైనఅనే నడమంతరపు అగ్రవర్ణత్వపు ముసుగును చించి అవతల పారెయ్యాలి. ఇంకా చెప్పాలంటే 'DECASTIFY' కావాలి అన్న సతీష్ చందర్ మాటలు బి.సి. కవులను పునరాలోచింపజేశాయి."[1] ఈ నేపథ్యంలో సమాజంలో సగభాగమైన బి.సి.ల గురించి బి.సి. రచయితలు బి.సి.ల అస్తిత్వం గురించి ఆలోచించారు. యస్.సిలు దళిత వాదంగా, ముస్లింలు మైనార్టీ వాదంగా తమ గురించి చెప్పుకుంటే బి.సి.లు బి.సి. వాదంగా లేదా బహుజన వాదంగా రాసుకుంటూ రావడం ప్రారంభమైంది. తరతరాలుగా బహుజనులపై ఆధిపత్యం చెలాయించడం వల్ల సబ్బండ వర్ణాల గొంతుకలకు అక్షర రూపమైంది. భావవాదం, అభ్యుదయవాదం, విప్లవవాదం, దిగంబరవాదం, స్త్రీవాదం, దళిత, గిరిజన, ప్రాంతీయ, అస్తిత్వవాదాలు ఎలా తమ అస్తిత్వ గొంతులు సాహిత్య ఉద్యమాలుగా వచ్చాయో బహుజన పేరుతో బి.సి.ల పరంగా వాడుతూ, బి.సి. వాద సాహిత్యం రావడం జరిగింది.

---

1. తెలుగులో కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమి, పుట.226

బి.సి. వాదం ఆవిర్భావంతో తెలుగు సాహిత్యంలో బహుజన వర్గాలు తమ సాహిత్యకోణం నుంచి ప్రశ్నల వర్షం కురిపించారు. తమ మూలాల నుంచి స్వరం కదిపారు. బి.సి.ల్లోని అనేక కులాలు ఆర్థికంగా బలహీనంగా ఉన్నాయి. బి.సి.ల సంస్కృతి, కళలు మరుగునపడిన విధానం, సంచార కులాల జీవనం, ప్రపంచీకరణలో వచ్చిన మార్పులు వృత్తిదారుల బతుకులపై ప్రభావం చూపిన విధానం, రాజకీయాలలో బి.సి.ల స్థితిగతులు వీటన్నింటిని బి.సి. రచయితలు కథల రూపంలో తీసుకొచ్చారు. అలాగే కవిత్వరూపంలో వెంటాడేకలాలు – వెనుకబడిన కులాలు' అన్న బి.సి. కవిత్వ సంకలనం రూపుదాల్చింది. బి.సి.లకు సంబంధించి సర్వసమగ్రంగా అన్ని కులవృత్తులకు సంబంధించిన కవితలు లేకపోయినప్పటికి, బి.సి. కవిత్వంలో తొలి కవిత్వ సంకలనంగా వచ్చింది. ఆ తర్వాత అనేక కవితలు బి.సి. వాదంతో వచ్చాయి.

బహుజనులు వృత్తులను మాత్రమే పోగొట్టుకునే కథలు రావడం జరిగింది. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వారి ఉనికిని గురించి కథలు తక్కువుగా వచ్చాయి. వాటి గురించి కథలు రావాలి.

## 1.10. బహుజన దృక్పథం

"ప్రపంచ సాహిత్యమంతా ప్రధానంగా రెండు మార్గాల్లో నడుస్తుందని చెప్పే వీలుంది. ఒకటి సమాజాన్ని కొన్ని ఆధిపత్య వర్గాలకు అనుకూలంగా మార్చుకోవడానికి సాహిత్యాన్ని ఒక సాధనంగా వాడుకునే దృక్పథం. దీన్ని భావవాద దృక్పథం అంటారు. రెండు సమాజం శ్రమ విభజనపై ఆధారపడి ఉందని భౌతిక పరిస్థితులే ఆ సమాజ స్థితిగతుల్ని నిర్దేశిస్తుంటాయనీ, ఇలా నిర్దేశించడంలో పాలకుల, ఆధిపత్య వర్గాల, ప్రభావం పనిచేస్తుందని చెప్పేది రెండవ దృక్పథం. దీన్ని సామాజిక భౌతిక ధృక్పథం అని అనొచ్చు. బహుజన దృక్పథం దీనికి దగ్గర్లోనే ఉంటుంది."[1] బి.సి. అస్తిత్వవాద ఉద్యమంలో భాగంగా వచ్చిన సాహిత్యం బహుజన వాదంగా వచ్చిందని ఇంతకు

1. బహుజన సాహిత్య దృక్పథం – దార్ల వెంకటేశ్వరరావు, పుట.16

ముందు చెప్పుకున్నాం. అంటే సాహిత్యం కులాన్ని పట్టించుకొని వెలువడిన విధానాన్ని బహుజన దృక్పథం తెలుపుతుంది. బహుజన దృక్పథం కులాన్ని ప్రోత్సహించదు. కులనిర్మూలనకు ప్రయత్నిస్తుంది. బహుజన దృక్పథం కులం వల్ల కలిగే పీడనకి ప్రాధాన్యత ఇస్తుంది. భూమి సమస్య, వృత్తి, కులవృత్తులు, వీరి సమస్త జీవన విధానమంతా కులంతోనే ముడిపడి ఉంది.

సాంఘికంగా, విద్యా పరంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే రాజకీయాధికారం అనివార్యంగా ఉంటుంది. రాజకీయాధికారం ద్వారానే సాంఘిక సాధికారత, సామాజికన్యాయం, సామాజిక మార్పు సాధ్యమని బహుజన దృక్పథం చెబుతుంది. కావున బలహీన వర్గాలకు చెందిన ప్రజలు ఉన్నత వర్గాలతో సమాన స్థాయికి చేరడానికి చాలా అడ్డంకులు దాటాల్సివుంది. తరతరాలుగా వీరికి కొన్ని బలహీనతలుంటాయి. కాబట్టి ఏ కులము ఎక్కువ కాదు. ఏ కులము తక్కువ కాదు. అన్ని కులాలు సమానమే అనే భావనతో బహుజనకులాలు మెలగాలి. మనుషులందరూ పుట్టుకతో సమానము. భారత రాజ్యాంగం అందరికి స్వేచ్ఛ, సమానత్వం, సోదరత్వం, అన్ని రంగాల్లో ఎదిగే అవకాశాలను ఇచ్చింది. వాటిని అందుకొని ముందుకు సాగడానికి అడ్డంకిగా ఉండే అన్ని భావజాలాలను వదులుకోవాలి. అన్ని రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాహిత్య సాంస్కృతిక రంగాల్లో చలనం సృష్టించాలి. సామాజిక చలనాన్ని నిర్దేశించగలగాలి. సమర్థవంతమైన నాయకత్వ పాత్ర నిర్వహించగలగాలి. రాజకీయరంగంలో పనిచేసే వాళ్ళ ఐక్యతకు కృషి జరగాలి. సామాజిక రంగంలో విడదీతలను అర్థం చేసుకొని పరస్పర గౌరవంతో మెలగాలి. బహుజన కులాల్లో ఒకరి సంస్కృతిని మరొకరు గౌరవించుకోవాలి. వీటన్నింటిని దృష్టిలోపెట్టుకొని ఉమ్మడి ఐక్యపోరాటం చేస్తే బహుజన రాజకీయాధికారం సులభసాధ్యం అవుతుంది. బి.సి.లు కులాలుగా కాకుండా బహుజనులుగా ఐక్యత చెంది దళితశక్తితో మమేకమైతే బహుజన రాజ్యాధికారం సాధ్యమవుతుందని బహుజన దృక్పథం చెబుతుంది.